క్లుప్తంగా

ఆడిటింగ్‌పై అవగాహన



ఆడిటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: గ్రామ పంచాయతీలలో వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన నిధులపై ఆడిటింగ్ చేసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్ర అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కారాలయంలో కార్యదర్శులకు ఆడిటింగ్‌పై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సోమవారం నుంచి ఆడిట్ చేస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీలలో 28 రకాల రికార్డులను సిద్ధ చేసుకోవాలన్నారు. ఆడిటింగ్‌లో నిధుల ఖర్చుపై లెక్కలు లేకపోతే సంబంధిత కార్యదర్శులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆడిటింగ్ ఆఫీసర్ మధుకిరణ్ రెడ్డి, ఆడిటర్ వెంకటేష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన



పశువులకు పిడుదుల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారిపల్లెలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 120 పశువులకు వైద్యపరీక్షలు చేశారు. నట్టల నివారణ, పిడుదుల నివారణ మందును పిచికారీ చేశారు. పశుసంవర్థకశాఖ సహాయకులు ఖాదర్‌వల్లీ, నాయకులు సదాశివరెడ్డి, సంతోష్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు కల్లూరు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కల్లూరు విద్యార్థులు

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కల్లూరు వీఆర్‌ఆర్ కళాశాలకు చెందిన నలుగు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా లయన్స్ క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ శుక్రవారం తెలిపారు. కళాశాలకు చెందిన సమీర్, ఠాగూర్, హేమాద్రి, బాలరాజు ఈనెల 9,10న కావలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. వీరికి లయన్స్ క్లబ్ తరపున క్రీడాదుస్తులు పంపిణీ చేసినట్లు చెప్పారు.

రేషన్ బియ్యం ఇవ్వలేదని..

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ ఓదులపేటలో రెండు నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వలేదని శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. చారాలలోని రేషన్‌షాపు డీలరు వద్దకెళ్తే బియ్యం వేయడం లేదని, తమ వద్ద స్టాకు లేదని, వేరొక చోట తీసుకోవాలని దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. చివరికి 30 కుటుంబాలకు చెందినవారు రెండునెలలుగా వేరొక షాపు వద్ద బియ్యం తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు స్పందించి ఓదులపేటలోనే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.


సెబ్ డిప్యూటీ కమిషనర్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీసీ నాగముద్దయ్య

పలమనేరు: పలమనేరు సరిహద్దుగా మీదుగా కర్ణాటక నుంచి ఒక్క బాటిల్ మద్యం కూడా కూడా ఇక్కడికి రాకుండా చూడాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దుల్లోని జంగాలపల్లె అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తర్వాత పట్టణంలోని సెబ్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతం అటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో ఇక్కడి సెబ్ అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సెబ్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



రామకృష్ణ



జఫ్రుల్లా

వి.కోట: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన రామకృష్ణ, జిల్లా కార్యదర్శిగా జఫ్రుల్లా నియమితులయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ నుంచి శుక్రవారం వారు నియామక పత్రాలను అందుకున్నారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు చెప్పారు.

గ్రామ స్వరాజ్యం ఘనత జగనన్నదే

- ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ



నీళ్ల ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లి : మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీ ఎన్. రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఎన్. వెంకటేగౌడ పేర్కొన్నారు. శుక్రవారం బైరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన వివిధ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ

బైరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. అలాగే జల జీవన్ మిషన్ పథకం కింద ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. మన రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలుస్తోందన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతుభరోసా కేంద్రాలు, పాల కేంద్రాల ఏర్పాటుతో మండల కేంద్రాలకు వెళ్లి కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే పని లేదన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు ఇళ్ల వద్దకే వెళ్లి సామాజిక పింఛన్లు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. గ్రామాల్లో తక్షణం పరిష్కరించాల్సిన సమస్యల కోసం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98శాతం నెరవేర్చారని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పేదలకు మేలుజరగకుండా తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు మొగసాల రెడ్డెప్ప, యువరాజు, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి,



లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రూప, తమీమ్, సర్పంచులు వెంకటేష్, రాజప్ప, బాలక్రిష్ణగౌడు, దేవేంద్రరెడ్డి, చంద్రమౌళి, ఎంపీటీసీలు వినాయకం, బాస్కర్‌మొదలి, సురేష్, జగదీష్, నాగరాజు, కో– ఆప్షన్ సభ్యులు ఫైజుల్లా, మండల కన్వీనర్ కార్తీక్, నాయకులు తబ్రాజ్, శంకర్‌రెడ్డి, జయకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, షాకీర్, అమరనాథరెడ్డి, కేశవులు, హరి తదితరులు పాల్గొన్నారు.

‘బాబు, లోకేష్‌పై అనర్హత వేటు వేయాలి’



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా, హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు నారా లోకేష్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ఎన్నికల సంఘం ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లోకేష్ యువగళం పాదయాత్రకు స్పందన లేకపోవడంతో విద్వేషాలు రెచ్చగొట్టి ప్రచారం పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇక ఎన్నికల్లో గెలవమనే ఉద్దేశంతో కార్యకర్తలను రెచ్చగొట్టి, ఉసిగొల్పుతున్నారన్నారు. ఐటీ నోటీసులకు చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు కుంభకోణాలు, ఐటీ నోటీసులపై ఎల్లో మీడియా, ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు బాబు రెడ్డి, ఇమ్రాన్, పుత్రాజు, గిరిధర్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, ధనశేఖర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, సర్పంచులు నారాయణరెడ్డి, మురళీరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఉషారాణి, వెంకటరమణ, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని రావణ కాష్టం చేయాలని యత్నిస్తున్న బాబు



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్, పక్కన ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని అధికార దాహంతో రావణ కాష్టంలా చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ యత్నిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెబుతారని ఎంపీపీ ఈశ్వరయ్య జోస్యం చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమీపంలో భీమవరంలో జరిగిన సంఘటనను ఆయనతోపాటు ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్, మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ గంగాధరం ఖండించారు. వారు మాట్లాడుతూ..లోకేష్ యువగళం పాదయాత్రలో ఎర్ర టీషర్టుల ముసుగులో సంఘ విద్రోహ శక్తులు, రౌడీ షీటర్లను రప్పించి దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. గెలవలేమనే ఉద్దేశంతో ఇలా హింసకు ప్రేరేపిస్తున్నారని, పుంగనూరు, భీమవరంలో జరిగిన ఘటనలే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. రాబోవు రోజుల్లో టీడీపీ భూస్థాపితం అవడం ఖాయమన్నారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, సర్పంచులు వెంకటరమణ, రెడ్డెప్ప, మాజీ సర్పంచులు శ్రీరాములు, తిమ్మయ్య, వసంతమ్మ, వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు సాంబయ్య, వీవీ రమణ, గౌస్ పీర్, తాతమల్లయ్య, టీచర్ రమణ, సూరి రెడ్డి పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయాల సాధనకు కృషి



రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న చల్లా కృష్ణారెడ్డి

రొంపిచెర్ల: జార్జిరెడ్డి ఆశయాల సాధన కోసం యువత కృషి చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. ఆయన రొంపిచెర్ల క్రాస్ రోడ్డు నుంచి తిరుపతికి జార్జిరెడ్డి స్మారక బైక్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. చల్లా జార్జిరెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేశారని, ఆయన బాటలో పీడీఎస్‌యూ పయనిస్తుందన్నారు. ప్రధాని మోదీ ప్రైవేటీకరణ విధానాలతో విద్యారంగాన్ని దోపిడీదారుల చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించి, మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చల్లా కృష్ణారెడ్డి, రాష్ట్ర పీడీఎస్‌యూ మాజీ అధ్యక్షుడు కె.భాస్కర్, ప్రసాద్, మనోజ్, శ్రీకాంత్, జీవన్‌రెడ్డి, వెంకటరత్నం, హరికృష్ణ, ఆదిశేషు, మహేష్, ధనశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఉలవలు పంపిణీ



ఉలవలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేష్ బాబు

పెద్దపంజాణి: ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసిన ఉలవలను కొగిలేరు సర్పంచ్ రమేష్ బాబు రైతులకు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో 610 బ్యాగులు, ఒక్కొక్కటి రూ 216లకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, రైతులందరూ ఉలవలు సాగు చేసి ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆర్‌బీకేలలో సబ్సిడీ ధరకు అన్నిరకాల విత్తనాలు, నాణ్యమైన ఎరువులను పొందవచ్చని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరంధామ, పీఏస్ మహేశ్వర్, వైఎస్సార్ సీపీ నాయకులు శివశంకర్ రెడ్డి, కృష్ణప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు...

సోమల: ప్రధాన మంత్రి కృషి సంచాయి యోజన, జిల్లా నీటి యాజమాన్య సంస్థ చిత్తూరు ఆధ్వర్యంలో శుక్రవారం సబ్సిడీపై పైపులను ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్ పంపిణీ చేశారు. వ్యవసాయాధికారిణి శోభారాణి మాట్లాడుతూ, మండలంలోని ఆరు పంచాయతీలకు వాటర్‌షెడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, బీసీలకు 80 శాతం సబ్సిడీపై అర్హులైన 41 మంది లబ్ధిదారులకు రెండు ఇంచీల పైపులు 140, రెండున్నర ఇంచీల పైపులు 1265 మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, నేతలు పీఎల్‌ఆర్ రాజారెడ్డి, వీవీ రమణ, బగ్గిడి నాగరాజ, నాగభూషణం రెడ్డి, తాతమల్లయ్య, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



సబ్సిడీ పైపులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

వైఎస్సార్ సీపీ నేత మృతి



శంకర్‌రాజు (ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లలో నివాసం ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్‌రాజు (60) (మున్సిపల్ కౌన్సిలర్ యువకుమారి భర్త) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తదితరులు ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి భార్యను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

నిబద్ధతతో ప్రజలకు సేవలు



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్, చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నిబద్ధతతో ప్రజలకు సేవలు అందివ్వాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 4, 5 సచివాలయాలను మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టిక, సేవల నమోదు, సేవల జాబితాలు, ప్రజా వినతుల నమోదు, పరిష్కారంపై ఉద్యోగులను ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు కొంత మంది యూనిఫాం లేకుండా రావడం, వేళకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాలపై ఎలాంటి ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు



ట్రాఫిక్ తీరును పరిశీలిస్తున్న సీఐ రాఘవరెడ్డి

పుంగనూరు: పట్టణంలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడం, లగేజీలు పెట్టడం చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ రాఘవరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంబీటీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు రోడ్డు, నాగపాళ్యం, పాతబస్టాండు, గోకుల్ సర్కిల్ ప్రాంతాలలో పర్యటించారు. రోడ్ల స్థలాన్ని ఆక్రమించి పెట్టిన దుకాణదారులు పెట్టిన బోర్డులను తొలగించి, వారిపై కేసులు నమోదు చేశారు. పైవిధంగా హెచ్చరించారు. పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరూ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో నడుచుకోవాలన్నారు.

చిన్న వ్యాపారస్తులకు శుభవార్త



పూల వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: పట్టణంలో రోడ్డుపై కూరగాయలు, పండ్లు, పూలు తదితరాలు విక్రయించే వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల విక్రేతలకు ఎమ్మెల్సీ భరత్ శుభవార్తను ప్రకటించారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దుకాణదారులతో మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపాలిటీ వసూలు చేస్తున్న అద్దె రుసుం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో తోపుడు బండ్లు, వీధి వ్యాపారులకు మున్సిపాలిటీ నుంచి గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ గుర్తింపు కార్డు ఉన్న వారు గేటు రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురుగేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



పులిచెర్ల : మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఫలాలు దరి చేరుస్తోందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తెలియజేస్తే వారికి కూడా అందేలా చూస్తామన్నారు. అనంతరం మండలంలో కొత్తగా మంజూరైన 164 పింఛన్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి, నాదమునిరెడ్డి, నాగరాజ ప్రసాద్, పోకల చంద్ర, వైస్ ఎంపీపీ ఈశ్వరి, సర్పంచ్ రాణెమ్మ, ఎంపీడీఓ రాజశేఖర్, షకూర్, రెడ్డి అహమ్మద్, సంతోష్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: అర్హులైన పేదలందరికీ పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం ఇస్తోందని వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి అన్నారు. శుక్రవారం పొదలగుంటపల్లె సచివాలయం వద్ద సర్పంచ్ జయరాంతో కలిసి 21మందికి నూతన పింఛన్లు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీలత, వార్డు మెంబర్ ఉప్పరోళ్ల మణి, వైఎస్సార్‌సీపీ నేత గుంజి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: మండలంలోని నారాయణపురం తండా పంచాయతీలో నూతనంగా ఆరుగురికి మంజూరైన పింఛన్లను శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు పంపిణీ చేశారు. కొత్తగా పింఛను పొందిన వారు మాట్లాడుతూ, తాము సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ పార్టీ అధ్యక్షుడు లోకేష్‌నాయక్, నేతలు సౌందర్యనాయక్, వెంకటేశు నాయక్, చక్రి నాయక్ పాల్గొన్నారు.



సోమల : పొదలగుంటపల్లెలో..

కర్ణాటక మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా స్కూటీపై తరలిస్తున్న 432 టెట్రా ప్యాకెట్లను పలమనేరు సెబ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి మండలంలోని టి.వడ్డూరుకు చెందిన రెడ్డెమ్మ(55), గంగవరం మండలం కురప్పల్లెకు చెందిన కిరణ్‌కుమార్(30)ను పలమనేరు సమీపంలోని పెంగరగుంట క్రాస్‌లో అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు.

నేడే లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

పలమనేరు/పుంగనూరు : పుంగనూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, పుంగనూరు కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఆ కోర్టుల సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీనివాసరావు, వాసుదేవరావు విలేకరులకు తెలిపారు. రాజీమార్గమే రాజమార్గమని, పంతాలు, పట్టింపులకు పోకుండా కక్షిదారులు రాజీ చేసుకుని మనశ్శాంతితో జీవించాలన్నారు. ప్రిలిటిగేషన్ కేసులు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి ఇది ఎంతో మంచిదన్నారు. లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పుపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం కూడా ఉండదని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వేర్వేరు సమావేశాల్లో జడ్జిలు రవి, కార్తీక్, సింధు పాల్గొన్నారు.

యల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పెద్దపంజాణి: శ్రావణ మాసం సందర్భంగా మండలంలో తుర్లపల్లెలోని యల్లమ్మ ఆలయంలో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పాలాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

నిబంధనలు పాటించండి



తనిఖీలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వాహనచోదకులకు ఎస్పీ రిషాంత్‌రెడ్డి సూచించారు. చిత్తూరు నగరం మురకంబట్టు ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి తనిఖీలు చేశారు. రోడ్డు భద్రతపై వాహనదారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా అసాంఘిక చర్యలకు ఏవైనా పాల్పడుతున్నారా అనే విషయంపై ఆరా తీశారు.

అక్షరమే జీవితానికి పునాది

పెద్దపంజాణి: అక్షరమే జీవితానికి పునాది అని నాగిరెడ్డిపల్లె ఎంపీ యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బాబురెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు అ ఆ అక్షరాకృతిలో కూర్చుని అక్షరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి అక్షరాలను ప్రేమించినప్పుడే అవి భవిష్యత్తుకు పునాది వేస్తాయన్నారు. ప్రపంచ మేధావులు అందరూ అక్షరాలను ప్రేమించే ఎదిగారని, ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, మాధవన్, అంజప్ప, వాణిశ్రీ, రాజేష్‌బాబు పాల్గొన్నారు.

నారి..జోడు గుర్రాల స్వారీ

- ఒకరితో సహజీవనం
- మరొకరితో సాన్నిహిత్యం
- ప్రియుడితో కటకటాల పాలైన వైనం

ఆమెను పిల్లలతోపాటు భర్త వదిలేసి వెళ్లిపోయాడు.. అతడిని భార్య వదిలేసి పిల్లలతో సహా వెళ్లిపోయింది..ఈ తెగిన గాలిపటాలు ఒక్కటయ్యాయి. కలిసి ఎగిరాయి. సహజీవన ప్రయాణం చేశాయి. అయితే..ఈ ప్రయాణంలో పరిచయమైన మరొకడికీ ఆమె సన్నిహితురాలైంది. చివరకు జోడు గుర్రాల స్వారీ పెద్ద ఉపద్రవమే తెచ్చింది. చివరకు ఏమైందంటే..!

రామకుప్పం: ఇన్‌చార్జ్ ఎస్ మునిస్వామి కథనం.. వీ.కోట మండలం రాగిసముద్రానికి చెందిన శిల్ప(25), దాసార్లపల్లెకు చెందిన వెంకట్రామప్ప అలియాస్ పాపయ్య(45) చిన్నబల్దారులోని సిమెంటు ఇటుక బట్టీలో కూలిపని చేసేవారు. 11 ఏళ్ల కింద దీప విభేదాల కారణంగా బిడ్డలను తీసుకుని తన భర్త పాపయ్యను వదిలివెళ్లిపోయింది. అలాగే శిల్ప భర్త బాలు ఇద్దరి బిడ్డలను శిల్ప దగ్గర వదిలి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో పాపయ్య, శిల్పల మధ్య సాన్నిహిత్యం పెరిగి పదేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం జమ్మలమడుగు నుంచి వచ్చిన అనిల్‌కుమార్ రెడ్డి (31) అదే ఇటుకల బట్టీలో కూలి పనికి చేరాడు. అనిల్‌కుమార్,శిల్పతో సాన్నిహిత్యం పెంచుకుని ఏడాది క్రితం ఆమెను తీసుకుని జమ్మలమడుగుకు వెళ్లాడు. అక్కడ నుంచి ఆరు నెలల క్రితం ఇద్దరూ తిరిగొచ్చారు. శిల్ప మళ్లీ పాపయ్యతో వెళ్తానని అనిల్‌కుమార్‌రెడ్డికి చెప్పడంతో పలుమార్లు ఇద్దరూ గొడవలు పడ్డారు. ఈ నేపథ్యంలో రామకుప్పం మండలం సాకలకుప్పం సమీపంలోని మామిడితోపులో బుధవారం పాపయ్య, శిల్ప ఉండగా గమనించిన అనిల్‌కుమార్ రెడ్డి పాపయ్యపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. కత్తితో బలంగా తలపై వేటు వేయడంతో తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. బాధితుని అక్క నాగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వీ.కోట–పల్లికుప్పం రహదారిలోని చిన్నబల్దార్ పెద్దచెరువు కట్టపై అనిల్‌కుమార్‌రెడ్డి, శిల్ప ఉండగా శుక్రవారం ఉదయం ఇన్‌చార్జ్ ఎస్ఐ వారిని అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ నిమిత్తం మదనపల్లె సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.